

పదవుల పందెం..

- ఎవరు గెలుస్తారోనని పందేలు
- కోట్లల్లో కాస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్నికలకు ఇంకా సంవత్సరం ఉండగానే పదవుల పందెం మొదలైంది. ఎవరు గెలుస్తారోనని పందేలు కాస్తున్నారు. ఏకంగా కోట్లల్లో నాయకులు పందేలను కాస్తున్నారు...

జిల్లాలో ఎన్నికల వేడి మొదలైంది. గత ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా 14 నియోజకవర్గాల్లోనూ వైసిపి అభ్యర్థులు విజయం సాధించారు. ఇప్పుడు 2024 ఎన్నికల్లో ఎవరు విజయం సాధిస్తారోనని పందేలు కాయడం జిల్లాలో ప్రారంభమైంది. ఇటీవల మంత్రాలయం నియోజకవర్గంలో నాయకుల మధ్య పందెంతో మాటల యుద్ధం బయటపడింది. మంత్రాలయం నియోజకవర్గం పెద్దకడబూరు మండలానికి చెందిన వైసిపికి చెందిన మాజీ ఎంపిపి మళ్లీ బాలనాగిరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని, టిడిపి అభ్యర్థి తిక్కారెడ్డి ఓడిపోతారని బహిరంగంగా తన పందేన్ని ప్రకటించారు. రూ.2కోట్లు తాను పందెం కాస్తానని వెల్లడించారు. దీనిపై అదే మండలానికి చెందిన ఒక టిడిపి నాయకుడు స్పందిస్తూ టిడిపి అభ్యర్థి తిక్కారెడ్డి గెలిచి తీరతారని తాను పందెం కాస్తానని తెలిపారు. వైసిపి నాయకుడు ప్రకటించినట్లుగా తాను కూడా రూ.2కోట్లు పందెంగా కాస్తానని ప్రకటించారు. ఇద్దరూ కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్న దేవాలయాన్ని తమ పందేనికి వేదికగా పెట్టుకున్నారు. దాంతో పోలీసులు అప్రమత్తమై ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇలా జిల్లాలో నాయకులు బహిరంగంగానే పందేలను కాస్తున్నారు. కింది స్థాయి కార్యకర్తలు సైతం లోలోపల తమ పందేలను ఇప్పటి నుంచే కాయడం మొదలుపెట్టారు. ఎన్నికలు దగ్గరకు వచ్చే కొద్దీ కోట్లల్లో ఈ పందేలు నడవనున్నట్లు తెలుస్తోంది. మరో వైపు నాయకులే కాకుండా జిల్లాలో యువత కూడా ఈ రాజకీయ పందేల వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. ఐపిఎల్ సీజన్‌లో చేసే బెట్టింగ్ తరహాలో రాజకీయ నాయకుల గెలుపు ఓటములపై పందేలను కాసేందుకు సిద్ధం అవుతున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరు సీటు దక్కించుకునేది మొదలు 2024లో ముఖ్యమంత్రి ఎవరు అవుతారన్న వాటిపై పందేలను జోరుగా కాసేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం.



పాలకుల విధానాలను ఎండగట్టండి

- పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టండని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం బుధవార పేటలోని మూడు వార్డులలో సిపిఎం ప్రచార యాత్ర నాయకులు కృష్ణ అధ్యక్షతన చాణిక్యపురి కాలనీ ,ఆదిత్య నగర్, బుధవారిపేట, హబీబ్ ముబారక్ నగర్, ఎ. క్యాంపు, సంజయ్ గాంధీనగర్లలో సాగింది.ఈ సందర్భంగా కె.ప్రభాకర్ రెడ్డి, ఓల్డ్ సిటీ కార్యదర్శి, ఎం. రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు మొహమ్మద్ షరీఫ్ లు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం,రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం, ప్రజల మీద పన్నుల భారాలు, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేసి, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలతో పాటు కూరగాయల ధరలు కూడా పెంచేశారని అన్నారు. సిపిఎం ఈనెల ఒకటో తేదీ నుండి 31 వరకు వివిధ రూపాలలో ఇంటింటి ప్రచారం చేస్తోందన్నారు. రెండో దశ ఈనెల 15 నుండి 25 వరకు నగరం మొత్తం పర్యటించాలని, మూడో దశ 26 నుండి 31 వరకు మహాపాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈనెల 31న కలెక్టరేట్ ముట్టడిని విజయ వంతం చేయాలని ప్రజలను కోరారు. ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు , కర్నూలు నగరంలో మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలని కోరారు. ఎన్‌టిఆర్ గార్డెన్ తరహాలో జోహరాపురం డంపు యాడ్‌లో మెగాపార్కు నిర్మించాలని, జగన్నాథం గట్టు, పందిపాడు, వెంకాయపల్లెలో లబ్ధిదారులకు బిల్లులు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని, ఇళ్లకు బిల్లులు ఇవ్వాలని వివిధ రకాల డిమాండ్లతో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉంటుందన్నారు.

జిల్లాకు ఒరిగిందేమీ లేదు: గౌస్‌దేశాయి

కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు జిల్లా నుండి ఎంతోమంది ఉద్దండులు రాజ్యాధికారాన్ని చేపట్టిన ఒరిగిందేమీ లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ అన్నారు. కర్నూలు నగరం, జిల్లా సమగ్ర అభివద్ధి కోసం జరుగుతున్న పాదయాత్ర నాలుగో రోజు 23వ, 24వ వార్డులలో నిర్వహించారు. ప్రజల నుండి విశేష స్పందన లభించింది. నగరంలోని శ్రీరామ నగర్, లక్ష్మీ నగర్, జేఎస్ఆర్ నగర్, పాలకొట్టాలలో పాదయాత్ర కొనసాగింది. 24 వ వార్డు కార్యదర్శి ఎ.లీలావతి అధ్యక్షత వహించారు. డి.గౌస్‌దేశాయ్, నగరకార్యదర్శి టి.రాముడు, కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు, సి.హెచ్.సాయిబాబా కే.సుధాకరప్పులు ప్రజల ను ఉద్దేశించి మాట్లాడారు. సోషల్‌మీడియా జిల్లా నాయకులు ఎల్లాగౌడ్, సిపిఎం నగరనాయకులు శేషాద్రి, సి.శ్రీనివాసులు, ఎస్.హుస్సేన్‌బాష, ఎస్.ఉమాదేవి, ఆర్.నలిని, ఎస్.రత్నమ్మ పాల్గొన్నారు.

కర్నూలు క్రైమ్: కర్నూలు మండలం అభివద్ధి కోసం జరిగే సిపిఎం జీపు జాతాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ కోరారు. సిపిఎం మండల కార్యదర్శి హుస్సేనయ్య అధ్యక్షతన జరుగుతున్న జీపు జాతను కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో ప్రారంభించి మాట్లాడారు. కర్నూలు మండలం జిల్లా కేంద్రానికి అతి దగ్గరగా ఉందని, అలాంటి మండలంలో కూడా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు ఆంజనేయులు శ్రీరాములు బాలపిర రాఘవేంద్ర వెంకటేశ్వర్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాముడు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా నాయకులు బతకన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, సిపిఎం నాయకులు మునిస్వామి, బీసన్న, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, రంగరాజు, గోపాల్ పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికుల సంఘీభావం

కర్నూలు కార్పొరేషన్: సిపిఎం చేపట్టిన జిల్లా సమగ్ర అభివద్ధి కోసం మహాపాదయాత్రలో రవాణా రంగం కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపి జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్ రాధాకృష్ణ, ఎండి.అంజిబాబు కోరారు.కార్మిక కర్షక భవన్లో రవాణా రంగ కార్మికుల జిల్లా కమిటీ సమావేశం 106 వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రియాజ్ అధ్యక్షతన నిర్వహించారు. పిఎస్.రాధాకృష్ణ, ఎండి అంజిబాబు మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న ప్రజా కార్మిక రైతు సమస్యలు పరిష్కరించాలని జిల్లా సమగ్ర అభివద్ధికి రూ. పదివేల కోట్లు కేటాయించాలని కోరుతూ సిపిఎం చేపట్టిన పాదయాత్ర లో రవాణా రంగ డ్రైవర్లు కూడా పాల్గొనాలన్నారు. సిఐటియు న్యూ సిటీ నగర కార్యదర్శి సిహెచ్ సాయి బాబా, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బి. రాధాకష్ణ, రవి, సహాయ కార్యదర్శులు పి. మహమూద్, హుస్సేన్ వలి, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు గంగాధర్, నజీర్, హైర్ బస్సు యూనియన్ నాయకులు లింగమయ్య తదితరులు పాల్గొన్నారు. **వెల్దుర్తి:** జిల్లా సమగ్ర అభివద్ధి, వెల్దుర్తి సమగ్ర అభివద్ధి కోసం జీపు జాత నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు నగేష్, జిల్లా నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు అల్లుగుండు, మల్లెపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, వెంకటాపురం, నార్లాపురం, వెల్దుర్తి, రత్నపల్లి బోయినపల్లి నర్సాపురం సర్ప రాజపురం, రామళ్లకోట, పుల్లగుమ్మి, కలుగొట్ల, గ్రామాల్లో జీపు జాత ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల నాయకులు రాజు, రాముడు, రామానాయుడు, నాగన్న, అఖిల్, మహేష్, సిఐటియు నాయకులు రెడ్డి, అయ్యస్వామి, అలివేలు, మల్లి ,పెద్ద యేసు పాల్గొన్నారు.



ప్రచారయాత్రనుద్దేశించి మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి



ప్రచారయాత్రనుద్దేశించి మాట్లాడుతున్న గౌస్‌దేశాయి

జగనన్న సురక్ష అర్జీలను పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జగనన్న సురక్ష క్యాంపులో వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లతో కలిసి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ లోకి వెళ్లకుండా వచ్చిన దరఖాస్తులు మళ్లీ రీఓపెనింగ్.. కాకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో అందిన సర్వీస్ రిక్వెస్టులకు టోకెన్ జనరేట్ చేసి ఇంకనూ పరిష్కరించని వాటిని వెంటనే పరిష్కరించాలని, జిల్లాలో జరుగుతున్న రీ-సర్వేను స్టోన్ ప్లానిటేషన్ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా కార్యదర్శి ఎన్.అలివేలు

అత్యాచారానికి గురైన అమ్మాయిని చదివించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గోనెగండ్ల మండలం, గంజహళ్లి గ్రామంలో అత్యాచారానికి గురైన బాలికకు చదువు చెప్పించే బాధ్యత అయినా తీసుకోండని ఐద్వా, కెవిపియస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణమ్మ, ఎన్ అలివేలమ్మ, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, జిల్లా నాయకులు కెఎస్. పద్మ మాట్లాడుతూ గోనెగండ్ల మండలం, గంజహళ్లి గ్రామంలో గత 29 రోజుల క్రితం అభం శుభం తెలియని నిరుపేద బాలిక అత్యాచారానికి గురైన సంగతి అందరికీ తెలిసిందేనని,ఇప్పటిదాకా అమ్మాయి కుటుంబానికి ఎలాంటి సహకారం అందలేదన్నారు. బాలికను పెద్దపాడు వద్ద ఉన్న ఐసిడిఎస్ పరిధిలోని హాస్టల్‌లో ఉంచడం తప్ప అమ్మాయికి చదువు చెప్పించాలన్న బాధ్యతను కూడా అధికారులు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా బాలికకు నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా ఎమ్మిగనూరు మండలం బనవాసి వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో సీటు ఇప్పించి, చదువుకునేందుకు అవకాశం కల్పించాలని జిల్లా జెసిని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డిఇఒ తో మాట్లాడి స్కూల్లో చేర్పించాలంటూ ఆదేశించారు.

క్లాప్ డ్రైవర్ల జీతాలిచ్చే వరకు పోరాటం

ఆటోలను నిలిపేసి నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ క్లాప్ డ్రైవర్ల జీతాలు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పున్నమి గెస్ట్ హౌస్ వెనకాల క్లాప్‌ఆటోలను పార్కింగ్ చేసే స్థలంలో మున్సిపల్ కార్పొరేషన్ క్లాప్ ఆటోల యూనియన్ కార్యదర్శి రఘు అధ్యక్షతన ఆటోలను బంద్‌చేసి సోమవారం నిరసన తెలిపారు. సిఐటియు ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, రామాంజనేయులు (విజయ్), న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి సాయిబాబా మాట్లాడారు. కర్నూలు నగరాన్ని చెత్త లేని నగరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం స్వచ్ఛ క్లాప్ ఆటోలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ఆలోచనతో డ్రైవర్లను ఏర్పాటు చేసిందన్నారు. క్లాప్ ఆటోలు వచ్చి 18 నెలలు పూర్తయినా వాటిని నడిపే డ్రైవర్ అన్నకు అగ్రిమెంట్ ప్రకారం సరైన జీతం ఇవ్వడం లేదన్నారు. 18 నెలలుగా వారి జీతంలో నుండి ఈఎస్ఐ, పిఎఫ్ కటింగ్ చేసి వారి అకౌంట్లో వేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. అగ్రిమెంటులో ఉన్న విధంగా జీవో ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలని ఉన్నా వారికి ఇప్పటివరకు రూ.పదివేల లోపు మాత్రమే జీతం ఇస్తున్నారని తెలిపారు. చాలామంది కార్మికులకు 8 నెలల నుండి 3 నెలల వరకు జీతాలు పెండింగ్ లో ఉన్నాయని వారు కుటుంబాలను పోషించుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతూ అప్పులు చేసి బతకాల్సి వస్తుందని అన్నారు. కార్మికులు జీతాలు, హక్కులు అడగితే ఏజెన్సీ వారు, మున్సిపల్ అధికారులు వేధిస్తూ పని నుండి అక్రమంగా తొలగిస్తున్నారని అన్నారు. వేధింపుల కారణంగానే ఇద్దరు కార్మికులు చనిపోయి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అక్రమంగా తొలగించిన రఘు, సాయిచరణ్‌లకు డ్యూటీ ఇవ్వకుండా వేధిస్తున్నారని అన్నారు. నిరసన కార్యక్రమం దగ్గరకు రెడ్డి ఏజెన్సీ మేనేజర్ తన్వీర్ వచ్చి పది రోజులలో పెండింగ్ జీతాలు ఇప్పిస్తామని, పిఎఫ్,ఇఎస్ఐ సమస్యలు పరిష్కరిస్తామని, తొలగించిన కార్మికులను యాజమాన్యంతో మాట్లాడి తీసుకుంటామని , వేధింపులు అరికడతామని హామీ ఇవ్వడంతో కార్మికులు నిరసన విరమించి విధుల్లోకి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మైమూద్, కుమార్, మూస, క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.



ఆటోలను నిలిపేసి నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు



కలెక్టరేట్ వద్ద నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న సర్పచి బాలపీర

అదనపు రేషన్ షాపును ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ తాండ్రపాడు గ్రామంలో అదనపు రేషన్ షాపును ఏర్పాటు చేయాలని సర్పంచి బాలపీర డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఈ తాండ్రపాడు గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న సర్పంచి బాలపీర మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ కాలనీ నుండి ప్రజలు రేషన్ సరుకులు తీసుకునేందుకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందులో భాగంగా అదనంగా రేషన్ షాప్‌ను ఏర్పాటు చేస్తే అక్కడే రేషన్ సరుకులు తీసుకుంటారని పేర్కొన్నారు. తక్షణమే జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందించి ఇక్కడ రేషన్ షాపుఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు

టీచర్ల సర్దుబాటు పక్కాగా నిర్వహించాలి

- జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సర్వీసెస్ మువ్వారామలింగం విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కర్నూలుకు విచ్చేసిన ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్ పాల్, డిప్యూటీ డిఇఒ హనుమంతరావులతో కలిసి సమీక్ష నిర్వహించారు. కర్నూలులో ఉపాధ్యాయుల సర్దుబాటును ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాబితాలను తయారు చేసి పంపాలన్నారు. అందుకు మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి నుండి త్వరగా ప్రతిపాదనలు తయారుచేసి పంపాలని ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న జెడి రామలింగం

అంగన్వాడీ బాలలను ప్రయివేటు స్కూల్లో చేర్చుకోవద్దు

ప్రజాశక్తి-సి బెళగల్ : మండలంలో గల అంగన్వాడీ కేంద్రాలలోని బాలలను ప్రైవేట్ పాఠశాలలో చేర్చుకొంటే చర్యలు తప్పవని మండల విద్యాధికారులు జ్యోతి, ఆడమ్ బాషా హెచ్చరించారు. ఐదేళ్లు నిండకుండానే చదివించుకొనే తపన మంచిదేనని అయితే అంగన్వాడీలోనే విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారని ఇక్కడ ప్రైవేట్ లోను ఆధార్ లింకు ఇబ్బంది తప్పదన్నారు. ప్రైవేట్ పాఠశాలలో వేళకు పిల్లలను వదలాలని వేళలు ముగిశాక ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గొర్రెకు సిజేరియన్ ఆపరేషన్

సి బెళగల్ కు చెందిన కురువ ఎర్రమల అనే రైతుకు ఒక గొర్రె ప్రసవ వేదన పడుతుండగా పశువైద్యులు ప్రవీణ్ సీజెరియన్ చేసి రెండు కవల పిల్లలను బయటకు తీశారు. సాధారణంగా మేకలకు ఒక ఈతలో ఒకటి లేదా రెండు పిల్లలు పుడతాయని, గొర్రెలకు మాత్రం ఒక ఈతకు ఒకటే అని అన్నారు. ఈ రైతు గొర్రెకు కవల పిల్లలు ఉండటంతో ప్రసవ వేదన పడుతూ ఉండగా ఆసుపత్రికి తెచ్చారని ప్రస్తుతం పిల్లలు, తల్లి ఆరోగ్యాంగా ఉన్నాయన్నారు.

ఓల్డ్ పెన్షన్ స్కీమ్ కోసం పోరాడుదాం

కెవిఆర్ ప్రసాద్, ఎస్‌సిఆర్ఇఎస్ డివిజనల్ సెక్రెటరీ

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

పాత పెన్షన్ విధానం కోసం పోరాడుదామని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘం డివిజనల్ సెక్రెటరీ కెవిఆర్ ప్రసాద్ అన్నారు. కర్నూలు రైల్వే స్టేషన్‌లో సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) కోసం సంఘం పోరాడుతుందని, న్యూ పెన్షన్ స్కీమ్‌లో అనేక లోపాలు ఉన్నాయని, కొత్త పెన్షన్ విధానంలో తాము ఏమేమి కోల్పోతున్నారో వివరించారు. కొత్త పెన్షన్ విధానానికి వ్యతరేకంగా డాక్టర్ మర్రి రాఘవయ్య నాయకత్వంలో ఆగస్ట్ 10 న ఢిల్లీ కి వెళ్లి గళం వినిపిస్తామని అన్నారు. ఈ సమావేశంలో కర్నూలు బ్రాంచ్ సెక్రెటరీ బి.మున్నాజి రావ్, చైర్మన్ బి.ప్రవీణ్ కుమార్, స్టేషన్ మేనేజర్ కె.నాగేంద్ర, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవిఆర్ ప్రసాద్

రిపోర్టర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

- జిల్లా వ్యాప్తంగా విలేకరుల నిరసనలు
-కల్లూరులో ఎపిడబ్ల్యుజెఎఫ్ బైక్ ర్యాలీ
-తహశీల్దార్లకు వినతి

ప్రజాశక్తి-విలేకరులు : నంద్యాల జిల్లా, మహానంది మండలం, వార్త రిపోర్టర్ మధుపై దాడి చేసిన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు నిరసన తెలిపారు. తహశీల్దార్లకు వినతిపత్రం అందజేశారు.

కర్నూలుహాస్పిటల్ : ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో ఈ ఘటనను ఖండిస్తూ జర్నలిస్టులు పాణ్యం, కల్లూరు కమిటీల ఆధ్వర్యంలో సోమవారం వినూత్న రీతిలో గుత్తి పెట్రోల్ బంక్, గ్లోబ్ సర్కిల్ నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని చిన్న రామాంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. బైక్ ర్యాలీ కల్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ ధర్నా నిర్వహించారు. కల్లూరు తహసీల్దార్ టివి.రమేష్ బాబుకు వినతిపత్రం అందచేశారు. అనంతర అక్కడ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం, గాంధీ విగ్రహం వద్ద వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గాంధీవిగ్రహం వద్ద ధర్నా చేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు చిన్న రామాంజనేయులు, నాగరాజు గౌడ్, నీలం సత్యనారాయణ,వార్త తెలుగు దిన పత్రిక జిల్లా ప్రతినిధి ప్రకాష్, ఎఐటియుసి నగర కార్యదర్శి ఎస్.మునెప్ప, జనసేన పార్టీ పత్తికొండ నాయకులు మాట్లాడారు. మహానంది మండలం వార్త విలేఖరి మధుపై దాడి చేసిన వారిని, పరామర్శించడానికి వెళ్లిన ఎపియుడబ్ల్యుజెజిల్లా ఉపాధ్యక్షులు భాష్యం మధుసూదనపై దాడికి పాల్పడిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రధాన అనుచరుడైన వైసీపీ నేత వీరారెడ్డి పైన, తక్షణమే కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలన్నారు.ఎపిడబ్ల్యుజెఎఫ్ కర్నూలు నగర కమిటీ సహాయ కారదర్శి మల్లికార్జున, పాణ్యం ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, సహాయ కార్యదర్శి నాగేంద్ర, కల్లూరు మండలం కమిటీ అధ్యక్షులు పిజి. వెంకటేష్, కార్యదర్శి పరమేష్, కోశాధికారి శ్రీనివాసులు, సభ్యులు లక్ష్మి నారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, జనార్ధన్, జేమ్స్, దేవరాజు, శ్రీను, ప్రసాద్, మధు, ఎపియుడబ్ల్యుజె నాయకులు కొండప్ప, నాగరాజు, శ్రీనివాసులు గౌడ్, విశాలంధ్ర మేనేజర్ నాగరాజు, వార్తదిన పత్రిక సిబ్బంది వెంకటేష్, వేణు, కృష్ణ మోహన్, రమేష్, జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.**పత్తికొండ**లో అంబేద్కర్ సర్కిల్ నుండి నాలుగు స్తంభాల కూడలి వరకు పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గం అధ్యక్షులు ఏం.సాల్ రంగడు, ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా ప్రధాన కార్యదర్శి రాముడు మాట్లాడారు. **గూడూరు**లో తహశీల్దార్ శివశంకర్ నాయక్‌కు, ఎంపిడిఓ మాధవి లతకు స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందించారు. విలేకరులు శ్రీనివాసులు నాయుడు, ప్రభాకర్, డెవలత్ ఖాన్, కిరణ్ కుమార్, ఉరుకుందు, లక్ష్మన్న పాల్గొన్నారు. **వెల్దుర్తి**లో విలేకరుల ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీసు ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎపియుడబ్ల్యూజె జిల్లా కార్యవర్గ సభ్యుడు చిరంజీవి, పత్తికొండ నియోజకవర్గ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, మండల అధ్యక్షులు అమీర్, కార్యదర్శి ఓమేంద్ర, మారన్న, రాజశేఖర్, దస్తు చిన్న, నజీర్, హరి, రాజు, మౌలాలి, శేఖర్ పాల్గొన్నారు. **తుగ్గలి**లో తహశీల్దార్ రవికి వినతిపత్రం సమర్పించారు. దాడి చేసిన వారిని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు నాగలింగన్న, మండల కమిటీ అధ్యక్షులు నాగేంద్ర డిమాండ్ చేశారు. సీనియర్ విలేకర్లు శ్రీనివాసులు, ఇమాములు, విజయ్, శేఖర్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరులో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విలేకరులు



గుత్తిపెట్రోల్ బంక్ గ్లోబ్ సర్కిల్ వద్ద బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న చిన్న రామాంజనేయులు



తుగ్గలిలో వినతిపత్రం ఇస్తున నాగలింగన్న, తదితరులు

సేవలను సద్వినియోగం చేసుకోండి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్



సరుకులు అందిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రభాకర్ టాకీస్ సమీపంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులకు మార్కెట్ ధర కంటే తక్కువ ధరలో నిత్యావసర సరుకులు బియ్యం, కందిపప్పు, మినప పప్పును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెట్ ధర కంటే బియ్యం కిలో కేవలం రూ.51 (పరిమితి 5కిలోలు) కందిపప్పు కిలో రూ.140, కిలో మినప పప్పు కిలో రూ.110లకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వినియోగదారులకు సబ్ కలెక్టర్ చేతుల మీద సరుకులను పంపిణీ చేశారు. వినియోగదారులతో నాణ్యత గురించి ఆరా తీయగా బాగుందని వినియోగదారులు పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ ఉప తహశీల్దార్ వలీబాషా, ట్రేడర్స్ శ్రీధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ తనిఖీ : పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న పౌర సరఫరాల స్టాక్ పాయింట్‌ను సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ గారు తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న రేషన్ నిల్వ, రికార్డులు, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ... బియ్యం కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. పౌర సరఫరాల ఉప తహశీల్దార్ వలీ బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

'చేనేత రంగాన్ని కాపాడుకుందాం'

ప్రజాశక్తి - ఆదోని

కళాత్మక వృత్తి చేనేత రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు తెలిపారు. సోమవారం పట్టణంలోని అక్షరశ్రీ పాఠశాలలో కలం ప్రహ్లాద అధ్యక్షతన కేంద్ర సాహిత్య అకాడమీ, అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో చేనేత రంగంపై వెలువడిన నాలుగు నవలలపై సాహిత్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్తలు ప్రముఖ రచయితలు డాక్టర్ ఎం.హరికిషన్, జంధ్యాల రఘుబాబు, సుమ భూపాల్ మాట్లాడారు. చేనేతల బతుకులు బాగుపడాలంటే నూతన యంత్ర సామగ్రి అందించాలని కోరారు. మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. అనంతరం సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల బసప్ప, అరసం జిల్లా ఉపాధ్యక్షులు పుల్లా రామాంజనేయులు, కెసి.మల్లికార్జున ఆధ్వర్యంలో 25 మంది కవులతో కవి సమ్మేళనం నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకులు రామచంద్రను సన్మానించారు. సవ్వప్ప, ఈరన్న, పద్యకవి ఈశ్వరప్ప, సుధాకర్ బాబు, జంగం స్వయంప్రభ, నాగన్న, ప్రేమ్ కుమార్, వెంకటేష్, సక్కిరి భాస్కర్, డాక్టర్ లీలా మనోహర్, కవి నల్లారెడ్డి సత్య, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెద్దకడబూరు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దకడబూరు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం సచివాలయం-1 ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా నాయకులు పరమేష్, కెవిపిఎస్ మండల కార్యదర్శి ఆనందరాజు, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి దేవదాసు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పర ఈరన్న మాట్లాడారు. పెద్దకడబూరులో 30 పడకల ఆస్పత్రి నిర్మించాలని, ఎస్సీ బాలుర హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. పెద్దకడబూరులో ఆది ఆంధ్ర పాఠశాల నుంచి జడ్‌పి హైస్కూల్ వరకు శాశ్వత డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని, వీరసేవ, విశ్వబ్రాహ్మణ, రెడ్డి కులాలకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ కాలనీ, చౌడేశ్వరి కాలనీలో సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని, మండలంలో అదనపు బ్యాంకులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

ప్రాజెక్టులు, ఉపాధి కోసం ఉద్యమం

- సిపిఎం జిల్లా నాయకులు ఆనంద్ బాబు

- ఆయా మండలాల్లో జీపు జాతాలు



గోనెగండ్లలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు



దేవనకొండలో మాట్లాడుతున్న నాయకులు



ఆస్పరిలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు



హొళగుందలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం, యువత ఉపాధి కోసం ఉద్యమించాలని సిపిఎం జిల్లా నాయకులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, సి.గురుశేఖర్ కోరారు. గోనెగండ్ల మండలానికే పేరు తీసుకొచ్చే గాజులదిన్నె ప్రాజెక్టు ఉన్నా మండల ప్రజలకు ప్రయోజనం లేకుండా పోతోందని మండిపడ్డారు. మండలానికి తాగు, సాగునీటి వసతి కల్పించి, మండల వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో జీపుజాతా చేపట్టారు. ఈ జీపుజాతా గోనెగండ్ల నుంచి పెద్దమర్రివీడు, గుల్లమొరుసు, చిన్నమర్రివీడు, కులుమాల, అలువాల, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, హెచ్.కైరవాడి, గాజులదిన్నె, పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె, ఎర్రబాడు, తిప్పనూరు, వేముగోడు, పుట్టపాశం, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, అయ్యకొండ, గంజహళ్లి, బైలుప్పల, బి.అగ్రహారం గ్రామాల్లో సాగింది. సిపిఎం మండల నాయకులు బి.కరుణాకర్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, గురుశేఖర్ మాట్లాడారు. సాగు, తాగునీటి కోసం, యువత ఉపాధి కోసం, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం ఈనెల 26 నుంచి 31 వరకు కలెక్టరేట్ వరకు మహాపాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలంలో సాగునీటి ప్రాజెక్టు ఉన్నా, తాగునీటి ప్రాజెక్టుగా మార్చి మండలానికి ఉపయోగపడకుండా జిల్లాలోని ఇతర ప్రాంతాలకు ఉపయోగించుకుంటున్నారన్నారు. ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణం ద్వారా మండల రైతులకు సాగునీరు అందించడంతోపాటు దాహార్తిని తీర్చాలని కోరారు. 2018లో లబ్ధిదారులుగా ఎంపికై ఇల్ల నిర్మాణాలు మొదలుపెట్టిన వారికి బిల్లులు విడుదల చేయకుండా రాజకీయం చేయడం దారుణమన్నారు. మండలంలోని మెజారిటీ గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే గుంతల రోడ్లు దాటుకుంటూ వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. సిపిఎం మండల నాయకులు నరసింహులు, మారేసు, దేవదాసు, పెద్దక్రిన్న, ఏలియా, శేషు, యోగి పాల్గొన్నారు.

దేవనకొండ : మండలంలో అసంపూర్తిగా, పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా పంట కాలువల నిర్మాణానికి పోరాడదామని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, హనుమంతు కోరారు. మండలంలోని పొట్లపాడు గ్రామంలో జీపుజాతాను ప్రారంభించి దేవనకొండకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు యూసుఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా మండలంలో 46 వేల ఎకరాలకు సాగునీరు స్థిరీకరణ ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పంట కాలువల నిర్మాణాలు పెండింగ్‌లో ఉండడంతో రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. తెర్నేకల్లు- పాలకుర్తి గ్రామాల మధ్య పెండింగ్‌లో ఉన్న పంట కాలువను పూర్తి చేయకపోవడంతో ఆయా గ్రామాలకు సాగునీరు అందడం లేదన్నారు. గుండ్లకొండ, పి.కోటకొండ, గుడిమిరాల, బంటుపల్లి, బేతపల్లి, బండపల్లి గ్రామాలకు హంద్రీనీవా ద్వారా కాలువల నిర్మాణాలు చేపట్టి ఆయా గ్రామాలకు సాగునీరందించాలని కోరారు. పొట్లపాడు హంద్రీ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు ఆస్పరి బాలకృష్ణ, పి.కోటకొండ సూరి సంజన, సురేంద్ర, శ్రీను, బజారి, నాగేష్, అశోక్ పాల్గొన్నారు.

ఆస్పరి : పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆస్పరి మండలం అభివృద్ధిలో వెనుకబాటులో ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు హనుమంతు, జిల్లా నాయకులు వీరశేఖర్ తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో రెండోరోజూ ములుగుందం, పుప్పాలదొడ్డి, పలుకూరబండ, డి.కోటకొండ, ముత్తుకూరు, వెంగలాయి దొడ్డి గ్రామాల్లో జీపుజాతా నిర్వహించారు. ఈ సంధ్భంగా వారు మాట్లాడారు. మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని తెలిపారు. డ్రెయినేజీ కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోందని చెప్పారు. సర్పంచులు, పంచాయతీ అధికారులకు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. వైసిపి అధికారం చేపట్టి నాలుగేళ్లయినా మండలాలు అభివృద్ధి చెందలేదన్నారు. మండలంలోని వెంగలాయి దొడ్డి చెరువుకు పందికోన రిజర్వాయర్ నుంచి నీరు నింపాలని డిమాండ్ చేశారు. వారానికోసారి ట్యాంకులను శుభ్రం చేయాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం, ఇన్స్యూరెన్స్ విడుదల చేయాలని కోరారు. జింకల బారి నుంచి రైతుల పంటలను కాపాడాలని, దేవరగట్టు సమీపంలో జింకల పార్కు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 26 నుంచి 31 వరకు చేపట్టే మహా పాదయాత్రలో ప్రజలు, రైతులు, కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఎం మండల నాయకులు బాలకృష్ణ, రామాంజనేయులు, మధు రెడ్డి, పత్తికొండ మండల నాయకులు సురేంద్ర, రైతు సంఘం, వ్యకాస నాయకులు వెంకట్ రాముడు, వీరభద్ర, రామాంజనేయులు, వెంకటేష్, రవి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి శివ, ప్రకాష్, రామన్న, మునిస్వామి, దొరస్వామి, ఏసోబు, సుందర రాజు పాల్గొన్నారు.

హొళగుంద : ఆలూరు నియోజకవర్గంలోని వేదవతి, నగరడోన ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి రైతులకు సాగు, తాగునీరు అందించాలని సిపిఎం నాయకులు కోరారు. మండలంలోని సమ్మతగేరి, వందవాగిలి, గజ్జహళ్లి గ్రామాల్లో జీపుజాతా సాగింది. సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, ఆలూరు మండల కార్యదర్శి షాకీర్, నాయకులు మైనా, నాగరాజు మాట్లాడారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈనెల 26 నుంచి 31 వరకు ఆదోని నుంచి కర్నూలు వరకు వందలాది మందితో సిపిఎం మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ ప్రాంతం జులై 16 నుంచి 19 వరకు జీపుజాతా కొనసాగుతుందని తెలిపారు. హొళగుంద మండలంలో ప్రభుత్వ వైద్యశాలను 50 పడకలకు మార్చాలని కోరారు. ధణాపురం నుంచి హొళగుంద వరకు గూళ్యం, సిద్ధాపురం, బళ్లారు, కోగిలతోట మీదుగా హొళగుంద వరకు రోడ్డు వేయాలని కోరారు. పెద్దహ్యాట, సమ్మతగేరి గ్రామాలకు నిలిపేసిన రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని తెలిపారు. హొళగుంద వాల్మీకి సర్కిల్ నుంచి బస్టాండు వరకు సిసి రోడ్లు వేయాలని, జడ్‌పిహెచ్‌ఎస్ దగ్గర వాటర్ ట్యాంకు నిర్మించాలని కోరారు. మోడల్ స్కూల్ ఏర్పాటు కోసం 26న ప్రారంభమై మహా పాదయాత్రలో, 31న కర్నూలు కలెక్టర్ ఎదుట జరిగే మహా ధర్నాకు హొళగుంద మండలం నుంచి వేలాది మంది తరలిరావాలని కోరారు. **హాలహర్వి** మండలంలో జీపుజాతా సాగింది. హాలహర్వి గ్రామం నుంచి జె.హొసల్లి, గూళ్యం, హొళగుందకు జాతా నిర్వహించారు. సిపిఎం మండల నాయకులు కృష్ణ అధ్యక్షతన జరిగిన గ్రామసభలనుద్దేశించి సిపిఎం నాయకులు కెపి.నారాయణ స్వామి మాట్లాడారు.

రూ.100 కోసం స్నేహితుని హత్య

- పోలీసు స్టేషన్ ఎదుట బంధువుల బైఠాయింపు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

రూ.100 కోసం తోటి స్నేహితుని గొంతు పిసికి చంపేశాడు ఓ వ్యక్తి. ఈ సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని నేలకోసిగి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... ఆదివారం రాత్రి గ్రామంలో ఉన్న సుంకలమ్మ దేవాలయం దగ్గర స్నేహితులతో ఈరన్న (26) కూర్చున్నారు. ఈరన్న స్నేహితుడు బసవరాజు మందు తాగేందుకు రూ.100 ఇవ్వాలని ఈరన్నను అడిగినట్లు సమాచారం. డబ్బులు ఇవ్వకపోవడంతో బసవరాజు, ఈరన్న మధ్య వాగ్వాదం చోటుచేసుకుని గొడవకు దారి తీసింది. కోపోద్రకుడైన బసవరాజు ఈరన్న గొంతు పిసికి చంపేశాడని సుంకలమ్మ గుడి దగ్గర కూర్చున్న కొంతమంది గ్రామస్తులకు తెలిపారు. ఈరన్నను కోసిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈరన్న అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. రూ.100 కోసం స్నేహితుని గొంతు పిసికి చంపడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. డబ్బుల చంపేశాడా లేక మరేమైన కారణాలు ఉన్నాయా అని గ్రామంలో చర్చించుకుంటున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోసిగి పోలీసు స్టేషన్ ఎదుట మృతుని బంధువులు మృతదేహంతో సోమవారం బైఠాయించారు. ఈరన్నను గొంతు పిసికి చంపిన వ్యక్తిని అరెస్టు చేసి శిక్షించాలని దాదాపు గంట సేపు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆదోని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించిన మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లకుండా కోసిగి పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ కుమార్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. హత్య చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ బాధితులకు సర్ది చెప్పారు. ఇక్కడి నుంచి వెళ్లి పోయి అంత్యక్రియలు జరిపించి, కావాలంటే అప్పుడు పోలీసు స్టేషన్‌కు రావాలని తెలిపారు. ఇలాంటి పనులు ఏమిటని బాధిత కుటుంబాలపై మండిపడ్డారు. మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేసి కఠినంగా శిక్షిస్తామని బాధితులకు సర్ది చెప్పడంతో వారు శాంతించారు.



మృతుడు ఈరన్న (ఫైల్)



పోలీసు స్టేషన్ ఎదుట వాగ్వాదానికి దిగిన కుటుంబ సభ్యులు

గాయత్రి మాత ఆలయంలో మరోసారి చోరీ

- ఫలించని దొంగల ప్రయత్నం

- ఆందోళన చెందుతున్న కాలనీవాసులు, భక్తులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు గీతానగర్‌లో ఉన్న గాయత్రి అమ్మవారి ఆలయంలో దొంగలు ఆదివారం రాత్రి మరోసారి చోరీకి పాల్పడ్డారు. పది రోజుల వ్యవధిలో ఈ సంఘటన జరగడం ఇది రెండోసారి. ఆలయంలోని కిటికీ పక్కన ఉంచిన హుండీని బయటి నుంచి తెరిచి లోపల ఉన్న డబ్బులు తీసుకునేందుకు ప్రయత్నించగా శబ్దం రావడంతో చోరీకి వచ్చిన వారు మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయినట్లు సమాచారం. ఇదే నెలలో 6న గేటు తాళాలు పగులగొట్టి ఆలయంలోకి వెళ్లి హుండీనే ఎత్తుకెళ్లి పోయారు. చోరీ విషయం పురోహితులు నరహరి శాస్త్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలను గుర్తించలేదు. చుట్టుపక్కల ఉన్న ప్రయివేట్ పాఠశాలల సిసి కెమెరాలను పరిశీలించి ఉంటే చోరీకి వచ్చిన వారు ఎవరో తెలిసిపోయేది. ప్రస్తుతం రెండోసారి కూడా చోరీకి ప్రయత్నం చేసేందుకు గేటు బయట నుంచి హుండీ పైమూత తొలగించే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో బయట నుంచి శబ్ధం వచ్చిందో, ఎవరన్నా అటువైపు వచ్చారో తెలియదు కానీ వారి ప్రయత్నం మానుకొని అక్కడ కుంకుమ చల్లి భక్తుడు మాదిరిగా ఆలయానికి వచ్చి వెళ్లినట్లుగా చేశారని ఆలయ పురోహితులు తెలుపుతున్నారు. పది రోజుల వ్యవధిలో దొంగలు రెండోసారి ఆలయంలో చోరీకి రావడంతో చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులు, భక్తులు ఆందోళన చెందుతున్నారు.



హుండీని తెరిచేందుకు ప్రయత్నించిన దొంగలు

నికర జలాల కోసం.. పోరాటాలకు సిద్ధం కావాలి

- ఆర్‌సిసి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దీక్ష - సిపిఎం మద్దతు

ప్రజాశక్తి - ఆదోని

వ్యవసాయం కొనసాగాలంటే నికర జలాల కోసం రైతులు పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆర్‌సిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆదోనిలోని పాతబస్టాండ్ మైదానంలో ఆర్‌సిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు అధ్యక్షతన దీక్ష చేపట్టారు. దీక్షకు రాజకీయ, ప్రజా, విద్యార్థి సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడారు. తుంగభద్ర జలాల కేటాయింపులో ఆంధ్రకు అన్యాయం జరుగుతోందన్నారు. తుంగభద్ర ఎగువన ప్రాజెక్టులు కడుతున్నా పాలకులు నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. జులై రెండో వారమైనా ఎల్‌ఎల్‌సి, హెచ్‌ఎల్‌సికి తుంగభద్ర నుంచి నీరు రాని పరిస్థితి ఉందని తెలిపారు. అప్పర్ భద్ర నిర్మాణం నిర్మాణంతో రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదముందన్నారు. ఇప్పటికైనా మేల్కొని ఉద్యమించకపోతే భవిష్యత్తు అంధకారమేనని తెలిపారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడి బోరుబావుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉందన్నారు.

సిపిఎం మద్దతు : ఈ దీక్షకు సిపిఎం నాయకులు వెంకటేశులు, లక్ష్మణ్, లింగన్న, గోపాల్, వీరారెడ్డి, వెంకటేష్ మద్దతు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు మాట్లాడుతూ... కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం నిరంతర పోరాటం చేస్తూనే ఉందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, కాలువల ద్వారా సాగునీరందించి వ్యవసాయాన్ని అభివృద్ధి పరచాలని కోరారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. ఈనెల 26 నుంచి జిల్లాలో పాదయాత్ర ప్రారంభించి 31న కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సాగు, తాగునీటి కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని కోరారు. దీక్ష శిబిరానికి రైతు నాయకులు సాయిబాబు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎల్‌ఎల్‌సి నీటి వాటా కోసం గతంలో ఎన్నో పోరాటాలు చేశామని, పాలకుల నిర్లక్ష్యం వల్ల పూర్తిస్థాయిలో రైతులకు న్యాయం జరగలేదని తెలిపారు. సిపిఐ నాయకులు అజయ్‌బాబు, లక్ష్మారెడ్డి, సుదర్శన్, రాజు, కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, పులిరాజు, ప్రకాష్, వీరేశ్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మల్లికార్జున, పిఒడబ్ల్యు సుజ్ఞానమ్మ, మణి, పిడిఎస్‌ఒ తిరుమలేష్, ఆర్‌పిఎస్‌ఎఫ్ బాలు, హెచ్‌ఆర్‌ఎఫ్ ఉరుకుందప్ప, ఎపిఆర్‌సిఎస్ నాయకులు సుభాష్, ఎఐఎఫ్‌టియు గంగన్న, బాష, ఐఎఫ్‌టియు వెంకప్ప, సవారప్ప, బసవ, రవిశంకర్ పాల్గొని సంఘీభావం తెలిపారు.



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సిపిఎం నాయకులు

పోలీసుల వేధింపులు తాళలేక

యువకుని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-ఆలూరు

పోలీసుల వేధింపులు తాళలేక తన కుమారుడు రఫిక్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తల్లిదండ్రులు రఫీక్, షేకున్‌బీ తెలిపారు. వారి వివరాల మేరకు... హాలహర్వి మండలం విరుపాపురం గ్రామంలో నెలరోజుల క్రితం అదే గ్రామానికి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రేమ జంట పారిపోయింది. అమ్మాయి తల్లిదండ్రులు హాలహర్వి పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పారిపోయిన ప్రేమ జంట పెళ్లి చేసుకున్నారని, వారికి రఫీక్ సహకరించాడనే అనుమానంతో పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టారు. పారిపోయిన ప్రేమజంట వచ్చేంతవరకు రఫీక్ ఇక్కడే ఉంటాడని తెలుపగా హెడ్ కానిస్టేబుల్ గెడ్డయ్యకు రూ.30 వేలు ఇచ్చి ఇంటికి తీసుకెళ్లారు. ఇంటికొచ్చి రఫీక్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి వారు ఎక్కడ ఉన్నారో చెప్పాలని కొట్టారు. సోమవారం రోజులాగే వచ్చి రఫీక్‌ను పోలీసులు పిలువగా 'చస్తానన్న చస్తాను. కానీ స్టేషన్‌కు వచ్చి దెబ్బలు తినలేన'ని ఇంట్లో పొలం కోసం తెచ్చుకున్న పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. రఫీక్‌ను ఆలూరు ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు ఆదోని ప్రయివేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఇందుకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకొని బాధితునికి మెరుగైన వైద్యం అందించాలని తల్లిదండ్రులు, బంధువులు, ప్రజాసంఘాలు కోరారు.



చికిత్స పొందుతున్న రఫీక్

ఎస్ఐని కలిసిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండలానికి కొత్తగా వచ్చిన ఎస్ఐ రమేష్ బాబును ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో సోమవారం ఎంపిపి జూటూరు హేమలత భర్త జూటూరు మారయ్య, వైసిపి నాయకులు జూటూరు లింగన్న, లాలూ స్వామిలు ఎస్ఐని పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని, ప్రజలకు అందుబాటులో ఉండి ఏ సమస్య వచ్చినా సామరస్య వాతావరణంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. నాని, రాజు, మురళీ, వలీ పాల్గొన్నారు. అలాగే ఎస్ఐ రమేష్ బాబును సొసైటీ ఛైర్మన్ మల్లికార్జున కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు.



ఎస్ఐని కలిసిన ఎంపిపి భర్త జూటూరు మారయ్య



'జగనన్న సురక్ష'కు గైర్హాజరయితే చర్యలు

- స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి



స్పందనలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న సురక్ష క్యాంపులకు అధికారులు గైర్హాజరయితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ హెచ్చరించారు. కొంతమంది నియోజకవర్గ స్పెషల్ అధికారులు, మండల స్థాయి బృందాలు మొక్కుబడి రీతిలో హాజరవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, ఇలాంటివి పునరావృత్తం కాకుండా ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపు పరిధిలోనే ఉండి ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టరుతో పాటు డిఆర్వో పుల్లయ్య తదితర జిల్లాధికారులు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న జగనన్న సురక్ష క్యాంపులకు హాజరై సర్వీస్ రిక్వెస్ట్లను క్లియర్ చేయడంతో పాటు స్థానిక కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేసి చేపట్టాల్సిన అంశాలపై సిఫారసు చేయాలని నియోజకవర్గ స్పెషల్ అధికారులు, టాస్కోర్స్ బృందాలకు సూచించారు. అప్పగించిన విధుల్లో అలసత్వం చూపే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు వెనుకాడమన్నారు. సర్వీస్ రిక్వెస్ట్లకు సంబంధించిన ధ్రువపత్రాల జారీకి సంబంధిత అధికారులకు బాధ్యత అప్పగించి ఫాలో అప్ చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం ఆడిట్లో పెండింగ్ ఉన్న 959 ఈకేవైసీని నియోజకవర్గాల వారీగా విభజించి మూడు రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌలు రైతులకు సిసిఆర్సి కార్డుల జారీకి పెండింగ్లో ఉన్న 49 శాతం పంపిణీకి ఆర్బికెల వారీగా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ఇంకా ప్రారంభించని 131 పనులు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను సత్వరమే నాణ్యతతో అర్జీదారుడు సంతృప్తి చెందేలా సంబంధిత అధికారులు తప్పనిసరిగా పరిష్కరించా లన్నారు. కార్యక్రమంలో 225 మంది తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లాస్థాయి ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

'వైఎస్ఆర్ జలకళ' మాయ

- మంజూరయినా వేయని బోరు
- రికార్డుల్లో మాత్రం వేసినట్లు చూపుతున్న అధికారులు

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్ర ప్రభుత్వం చిన్న, సన్న కారు రైతుల కోసం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ జలకళ పథకం అమలులో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. బనగానపల్లె మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన రైతు ఈడిగ రామ కొండయ్యకు వైఎస్ఆర్ జలకళ పథకం కింద మూడేళ్ల క్రితం బోరు మంజూరయింది. రైతు పొలంలో అధికారులు మాత్రం బోరు వేయలేదు. బోరు వేయాలని అధికారుల చుట్టూ రైతు తిరిగినా పట్టించుకోలేదు. చివరకు జిల్లా అధికారులను రైతు సంప్రదించగా అప్పటికే బోరు వేసినట్లు రికార్డులు చూపడంతో అయోమయంలో పడ్డాడు. వివరాలు... మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన రైతు ఈడిగ రామ కొండయ్యకు సర్వే నెంబరు 37లో 2-75 ఎకరాల భూమి ఉంది. దీంతో వైయస్సార్ జలకళ కింద బోరు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. 2020లో దరఖాస్తు నెంబర్ వైజెకె 13441133 ద్వారా బోరు మంజూరు అయింది. రైతు అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా బోరు వేయలేదు. దీంతో జిల్లా అధికారులకు దరఖాస్తు చేసుకోగా అప్పటికే బోరు వేసినట్లు స్టేటస్లో రావడంతో రైతు కంగు తిన్నాడు. రైతు రామ కొండయ్య ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామంలో బోరు వేయించుకున్నట్లు అధికారుల రికార్డులలో నమోదయింది. బోరు వద్ద ఓ మహిళ ఫొటో దిగిన దృశ్యాలను అధికారులు రైతుకు చూపించారు. దీంతో రైతు తనకు బోరు వేయలేదని, తన పొలం పెద్దరాజుపాలెం గ్రామంలో ఉందని, ప్యాపిలి మండలం గార్లదిన్నెలో తనకు సంబంధంలేని మహిళ బోరు వేయించుకుంటే తనకేమి సంబంధమని అధికారులను ప్రశ్నించారు. అయితే అధికారులు మంజూరైన దరఖాస్తుదారుడి పేరు మీద ఇప్పటికే బోరు వేసామని, ఏమీ చేయలేమని పేర్కొనడంతో రైతు హతాశుడయ్యాడు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి తనకు బోరు వేయించాలని రైతు రామ కొండయ్య కోరుతున్నాడు.


జలకళ పథకం కింద బోరు మంజూరైన పత్రాలను చూపిస్తున్న రైతు రామ కొండయ్య

విలేకరిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- జర్నలిస్టు సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

మహానంది వార్త విలేకరి మధుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని జర్నలిస్టు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నినాదించారు. సోమవారం నంద్యాల పట్టణంలోని తాలూకా పోలీస్ స్టేషన్ ఎదురుగా జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజె, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు శ్యామ్, మధు, మౌలాలి, మాదాల శ్రీనివాసు, నాగవర్ధన్ రెడ్డిలు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం లో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు అధికమయ్యాయని, దీనికి తగినభారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పోలీస్ అధికారులు జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులందరూ పాల్గొన్నారు. **పాణ్యం :** విలేఖరులపై దాడులు సమాజ హితానికి మంచిది కాదనివర్కింగ్జర్నలిస్టుల సంఘం పాణ్యం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య అన్నారు. మహానంది వార్త విలేఖరిపై వైసిపి కార్యకర్తలు దాడి చేయడాన్ని మండల విలేఖరులు తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విలేకరులు పాణ్యం ఎస్ఐకి వినతిపత్రం సమర్పించారు. విలేఖరులు శ్రీను, రంగస్వామి, వేణు, శీను, సిఐటియు భాస్కర్ పాల్గొన్నారు. **ఆత్మకూరు :** మహానంది మండలం లో పాత్రికేయుడు మధుపై వైసిపి నాయకులు దాడి హేయమైన చర్య అని ఏపీడబ్ల్యూజేఎఫ్ నేతలు అన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆత్మకూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున పాత్రికేయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు జోసఫ్ చంద్రశేఖర్ మాట్లాడారు. ఏపీడబ్ల్యూజే జిల్లా నాయకులు రవికుమార్, చంద్ర శ్యామ్, స్థానిక ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా పాత్రికేయులు (మిగతా 6వ పేజీలో..)



విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై కాలయాపన తగదు

- సిఐటియు, ఎఐటియుసి, విద్యుత్ ఉద్యోగుల సంఘం
- రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించకుండా చర్చల పేరుతో కాలయాపన చేస్తుంది తప్పా పరిష్కరించే దిశగా చర్యలు కనబడడం లేదని సిఐటియు, ఎఐటియుసి, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు మండిపడ్డారు. విద్యుత్ ఉద్యోగల కార్మికుల రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం నంద్యాల విద్యుత్ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ నాయకులు టి.కళ్యాణ్ చక్రవర్తి, సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు, ఎఐటియుసి జిల్లా నాయకులు శ్రీనివాసులు మాట్లాడారు. స్ట్రగుల్ కమిటీ చేసే పోరాటానికి కార్మికులంతా కలిసి రావాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం పెట్మెంటుతో పిఆర్సి ప్రకటించాలని, కాంట్రాక్టు కార్మికులందరికీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఎల్ఎం గ్రేడ్ 2 ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొవిషన్ డిక్లేర్ చేయాలని, చనిపోయిన వారి కుటుంబంలో కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఈపీఎఫ్ నుంచి జిపిఎఫ్గా ఉద్యోగులందరికీ మార్పు చేసి పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.శ్రీనివాసులు, కరీం, ఎఐటియుసి కె.రామకృష్ణ, కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు మౌలాలి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'మధుమణి' సేవలు ప్రశంసనీయం

- ఎంపీ, ఎమ్మెల్యేలు
- ఉచితంగా ఈఎన్టి శస్త్ర చికిత్స శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల

మధుమణి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో గత 32 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉచిత శస్త్ర చికిత్సల సేవలు ప్రశంసనీయమని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, పాణ్యం, నంద్యాల ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిలు అన్నారు. సోమవారం మధుమణి నర్సింగ్ హోమ్ సమావేశ భవనంలోఉచిత శస్త్ర చికిత్స శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమం ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వరుసగా 32 సంవత్సరాల పాటు ఉచిత శస్త్ర చికిత్సల శిబిరం నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. పాణ్యం ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ మధుసూదన రావు నంద్యాలలో కోట్లాది రూపాయల విలువ చేసే అత్యంత ఆధునిక పరికరాలతో కార్పొరేట్ స్థాయి వసతులతో ఆసుపత్రి ఏర్పాటు చేసి సాధారణ ప్రజానీకానికి అందుబాటులో వైద్యం అందించడం అభినందించదగిన విషయమన్నారు. నంద్యాల ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ మణిదీప్ పేదలకు ఖరీదైన ఉచిత శస్త్ర చికిత్సల సేవలు అందించడం ఈ ప్రాంత ప్రజలకు గొప్ప వరమన్నారు. ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ డాక్టర్ మధుసూదన్ రావు అందించిన ఉచిత వైద్య సేవలకు గుర్తింపుగా ఈనెల జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా భారతీయ వైద్య సంఘం జాతీయస్థాయి పురస్కారం ప్రకటించిందని తెలిపారు. డిసెంబర్ 28వ తేదీ కేరళలో జరగనున్న జాతీయ స్థాయి ఐఎంఎ సదస్సులో ఈ అవార్డును ఐఎంఎ జాతీయ అధ్యక్షులు అందజేస్తారని తెలిపారు. శిబిరం నిర్వాహకులు డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ నాగమణి, డాక్టర్ మణిదీప్ మాట్లాడుతూ వారం రోజులలో రూ. 50 లక్షల విలువ చేసే వందకు పైగా చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సలను పూర్తి ఉచితంగా చేస్తున్నామని, వారం రోజులపాటు ఓపీ సేవలు ఉచితంగా అందించి మందులు కూడా పంపిణీ చేస్తామన్నారు. అనంతరం ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ఐదు మందికి వినికిడి యంత్రాలను ఉచితంగా అందజేశారు. మధుమణి ఆసుపత్రి తరుపున ప్రజా ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మధుప్రీతి, మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ రెడ్డి, డాక్టర్ సహదేవుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఐఎంఎ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ జఫరుల్లా, కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్,కోశాధికారి డాక్టర్ పనిల్, డాక్టర్ రోహిత్, మధుమణి కుటుంబ సభ్యులు ప్రణీత్, సింధూ, ప్రముఖ వ్యాపారవేత్తలు బొగ్గరపు నాగరాజు , చిత్తలూరి శేషఫణి, చిత్తలూరి రాంప్రసాద్, చిత్తలూరి రామచంద్రయ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి మధుమణి ఉచిత శస్త్ర చికిత్సల శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, చిత్రంలో ఎంపీ పోచా బ్రహ్మనంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ తదితరులు


మహిళతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూముల బ్రహ్మారెడ్డి

టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారెంటీ : భూమా

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : భవిష్యత్తుకు గ్యారంటీ తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటిస్తూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలోని భారాలను వివరించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అవుకు రిజర్వాయర్లో బోటింగ్ పునఃప్రారంభమయ్యేనా..?

ప్రజాశక్తి - అవుకు



అవుకు రిజర్వాయర్లో బోటింగ్ తిరిగి ప్రారంభ మయ్యేనా అనే సందేహాలు మండల ప్రజల్లో తీవ్ర చర్చ నీయంగా మారాయి. ఈ ఏడాది మేలో జల విహార యాత్రకు వచ్చిన పోలీస్ కానిస్టేబుల్ కుటుంబం బోటు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. దీంతో రిజర్వాయర్లో బోటింగ్ పాయింట్ను మూసివేశారు. రిజర్వాయర్లో బోటింగ్కు ఇచ్చిన అనుమతులు ప్రతి ఏటా వాటిని అధికారులతో రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంది. అయితే రెన్యువల్ చేయించుకోకుండా బోటింగ్ నడుపుతుండడంతో ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు గుర్తించి బోటింగ్ పాయింట్ను మూసి వేయించారు. బోటింగ్ మూసివేసి రెండు నెలలు గడవడంతో మళ్లీ ప్రారంభం అవుతుందా లేదా అన్న సందేహం ప్రజల్లో చర్చనీయంగా మారింది. చుట్టూ ఎర్రమల కొండలు, మధ్యలో రిజర్వాయర్ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో బోటింగ్ పాయింట్ను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఎంతోమంది విహారయాత్రకు వచ్చి జలవిహారం చేసి ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా గడిపేవారు. అయితే రెండు నెలల కిందట జరిగిన బోటు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో బోటింగ్ పాయింట్పై రాష్ట్రస్థాయిలో తీవ్ర చర్చ జరిగి మూసివేశారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు బోటింగ్ పాయింట్ను పరిశీలించి ప్రభుత్వ అనుమతులతో తిరిగి ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సంజామల

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సంజామలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ముక్కామల మాజీ సర్పంచ్ పోచారం వెంకట్రాంరెడ్డి, ఆకుమల్ల నాగేశ్వర్ రెడ్డి, పేరుసోమల ఎంపీటీసీ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

50 కుటుంబాలు వైసిపిలో చేరిక : మండలంలోని పేరుసోమల గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలోకి ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. పెద్దన్న, పరదేశి నాగన్న, రామాంజనేయులు, శివమ్మ, లక్ష్మమ్మతో పాటు మొత్తం 50 కుటుంబాలు వైసిపిలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.


సంజామల : సంక్షేమ పథకాల బుక్లెట్ను అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ : ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని దొర్నిపాడు మండలం చాకరాజు వేముల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి అమర్నాథ్ రెడ్డి, జడ్పిటిసి శకుంతల, సహకార సొసైటీ అధ్యక్షులు భూమా చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆళ్లగడ్డ : మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వైసిపి ప్రభుత్వ పాలన దేశానికే ఆదర్శం

- ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి చేసిన అభివృద్ధి, సంక్షేమ పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం, నంద్యాల ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఇసాక్ బాష, రామసుబ్బారెడ్డి, మున్సిపల్ ఛైర్పర్సన్ మాబున్నిసాలు పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం జిల్లా కేంద్రంలోని నూనెపల్లి వద్ద వున్న ఉదయానంద రెసిడెన్సీలో వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు, జనసేననేత పవన్ కళ్యాణ్ వాలంటీర్ వ్యవస్థపై అనవసర వ్యాఖ్యలను చేయడం విచారకరమన్నారు. నంద్యాల నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నేటికి 22 వేలకు పైగా సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశామన్నారు. నంద్యాల పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రతిపక్షాలకు కనపడటం లేదా అని ప్రశ్నించారు. 2024 ఎన్నికల్లో నూటికి నూరు శాతం వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. సిఎం జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని, మంచి చేసిన ప్రభుత్వానికి పట్టంకట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎస్సీడీసీఎల్ డైరెక్టర్ డా. శశికళారెడ్డి, వ్యవసాయమార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, శాంతిరాం సంస్థల డైరెక్టర్ మిద్దె శివరాం, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ అనిల్ అమృతరాజ్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

మహానందిలో అభివృద్ధి పనులు

- పరిశీలించిన ఎమ్మెల్యే తనయుడు శిల్పా కార్తీక్ రెడ్డి

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో జరుగుతున్న కోనేరుల ఆధునీకరణ, మాఢ వీధుల ఆధునీకరణ పనులను సోమవారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తనయుడు శిల్పా కార్తీక్ రెడ్డి పరిశీలించారు. ముందుగా ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికారు. క్షేత్రంలో ఆషాఢ మాసం చివరి రోజు కావడంతో మహానంది గ్రామప్రజలంతా కలసి కామేశ్వరి అమ్మవారికి ఆషాఢ పట్టీ, చీరెసారెలను సమర్పించారు. వీరితో పాటు శిల్పా కార్తీక్ రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుణ్యక్షేత్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మరో ఆరు నెలలలో మహానంది పుణ్యక్షేత్రం సర్వాంగ సుందరంగా, గ్రీనరీతో నిండి ఉండే విధంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, పాలక మండల సభ్యులు, స్థానిక వైసిపి యువ నాయకులు పాల్గొన్నారు.


క్షేత్రంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తనయుడు శిల్పా కార్తీక్ రెడ్డి


కుళాయిలు ద్వారా నీటిని పట్టు కుంటున్న మహిళలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

- శివవరంలో నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలంలోని శివవరం గ్రామంలో నీటి ఎద్దడి అనే శీర్షికకన ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కరీముల్లా సోమవారం గ్రామానికి చేరుకుని నీటి సమస్యను పరిశీలించారు. కాలిపోయిన మోటార్ల స్థానంలో నూతనంగా మోటార్లను బిగించడంతో నీటి సమస్య పరిష్కారమయింది. నీటి సమస్య పరిష్కారం పట్ల గ్రామ ప్రజలు, మహిళలు ప్రజాశక్తి దినపత్రికకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రుద్రవరం : రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వికలాంగుల ఆదరణ సేవా సమిత్ వ్యవస్థాపక అధ్యక్షులు జజ్జారి మరియదాస్ అధికారులను కోరారు. సోమవారం వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రుద్రవరం ఎంపీడీవో మధుసూదనరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వికలాంగులకు పెన్షన్ రూ. 3 వేల నుండి రూ. 7 వేల వరకు పెంచాలన్నారు. 35 కేజీల అంత్యోదయ బియ్యం కార్డును, ఉచిత కరెంటు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రుద్రవరం ప్రెసిడెంట్ ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు అబ్దుల్ రహమాన్, ఆదరణ సేవా సమిత్ వికలాంగుల మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు శివమ్మ, వికలాంగులు పాల్గొన్నారు.

టెంకాయల అంగడి వేలం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మండలంలోని రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో సోమవారం టెంకాయల అంగడి వేలం పాటలు దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ హరిచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ వేలంలో ఆలయానికి రూ.6.50 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో సాయి జయచంద్రారెడ్డి తెలిపారు. మధుసూదన్ రెడ్డి రూ.6.50 లక్షలకు దక్కించుకున్నారు. ఆర్.కృష్ణాపురం గ్రామ పెద్దలు రంగారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.


వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం


తహసిల్దార్ కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నిత్యవసరాలకు సబ్సిడీ ఇవ్వాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో పేదలకు రేషన్ షాపుల నుంచి అందిస్తున్న నిత్యవసర సరుకులతో పాటు కూరగాయలు కూడా ప్రభుత్వం సబ్సిడీతో పేదలకు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, మండల అధ్యక్షులు ఎం నరేష్, కెవిపిఎస్ జిల్లా నాయకులు సంపత్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పెరుగుతున్న ధరలు వల్ల పేదలు కూరగాయలు కొని తినలేని పరిస్థితి ఉంటే.. చౌక డిపోల ద్వారా ఇచ్చే కందిపప్పు, చక్కెర, పామాయిల్ కూడా మూడు నెలలుగా ప్రభుత్వం ఇవ్వడం లేదు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే చౌక డిపోల ద్వారా నిత్యవసర సరుకులతో పాటు టమోటా, పచ్చిమిర్చి లాంటి కూరగాయలను పంపిణీ చేసి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎన్ దేవకుమార్, పి చిన్న చిన్నయ్య, దిబ్బన్న, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - బేతంచెర్ల

భవన నిర్మాణ కార్మికుడికి సిఐటియు ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. బేతంచెర్ల పట్టణంలో భవన నిర్మాణ కార్మికుడు డి. బికారి (చిన్నోడు) ఇటీవల పని చేస్తున్న సమయంలో కిందపడి తలకు బలమైన గాయం తగలడం అయ్యింది. ఆసుపత్రులకు చూపించిన నయం కాలేదు.. మంచానికే పరిమితం అయిపోయాడు. విషయం తెలుసుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు రూ.60 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబానికి అందజేశారు. బాధితుడైన డి. బికారి అలియాస్ చిన్నోడికి భార్య, కూతురు ఉన్నారు. సొంత ఇల్లు కూడా లేదు అద్దె ఇంట్లో జీవిస్తున్నాడు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు బాల వెంకట్, మండలం నాయకులు వైబి వెంకటేశ్వర్లు, ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్కే బాష, ఎం రషీద్, మాట్లాడుతూ బికారి అలియాస్ చిన్నోడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం పది లక్షల రూపాయలను లైవ్ చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే లేబర్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్ .రహమాన్, నూర్ అహ్మద్, బాలయ్య, కుమార్, దస్తగిరి ,షేక్షావలి, ఎస్ దాదా పీరా ,హుస్సేన్ ,ప్రభాకర్, ఎస్పీరా బాష తదితరులు పాల్గొన్నారు.


సిఐటియులో చేరిన అంగన్వాడీలు టీచర్లు ఆయాలు

సిఐటియులోకి.. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్

ప్రజాశక్తి - చాగలమర్రి

ఎం. పద్మావతి, ఎం.నాగమణి, జి.సంజమ్మ, ఎం. కళావతి జయలలితమ్మ, అస్నానమ్మ యూనియన్ నాయకుల నాయకత్వంలో 52 మంది అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సిఐటియులోకి సోమవారం చేరారు. చాగలమర్రిలో జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.యేసు రత్నం, ఏ నాగరాజు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల, జిల్లా నాయకురాలు రాజ్యలక్ష్మి, శైలజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి వర్కర్స్‌తో వెట్టిచాకిరి చేయించుకుంటోందని అన్నారు. ఎపి ప్రభుత్వము తెలంగాణ కన్నా వెయ్యి రూపాయలు అదనంగా వేతనాలు ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్న ఇచ్చిన వాగ్దానం నెరవేర్చలేదని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న టీఏ, డీఏలు ఇవ్వాలని కోరారు. ఈనెల 10, 11 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం దగ్గర రెండు రోజులు 36 గంటల ధర్నా సిఐటియు నాయకత్వంలో పెద్ద ఎత్తున జరిగిందని అంగన్వాడీల బాధలను అర్థం చేసుకొని వారి డిమాండ్లు పరిష్కరించాలని వారు కోరారు. సిఐటియులో చేరిన అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్‌కు స్వాగతం పలుకుతూ అందరూ ఐక్యంగా ప్రభుత్వం నుంచి అంగన్వాడి డిమాండ్స్ సాధించుకోవడానికి కలిసికట్టుగా పోరాటం చేయాలని వారు తెలిపారు.

రాయలసీమను అభివృద్ధి చేస్తాం : టిడిపి

ప్రజాశక్తి - ఆత్మకూరు

టిడిపి అధికారంలోకి వస్తే రాయలసీమను అభివృద్ధి అవుతుందని శ్రీశైలం నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు బొల్లారం.మల్లేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శ్రీశైలం నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బోల్లవరం. మల్లేశ్వర రెడ్డి, పస్పిల్ మున్నా అధ్యక్షతన మిషన్ రాయలసీమ కార్యక్రమాన్ని సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2000 కిలోమీటర్లు పూర్తి అయిన సందర్భంగా రాయలసీమకు టీడీపీ అధికారం లోకి వస్తే మిషన్ రాయలసీమను అమలు చేస్తామన్నారు. మేనిఫెస్టోలోని ప్రతి హామీ అమలు చేస్తామని అన్నారు. అనంతరం ఆర్టీసీ బస్ స్టాండ్ ఎదురుగా ఉన్న ఆటో కార్మికులకు మిషన్ రాయలసీమ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి పస్పిల్ మున్నా, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగుర్ ఖాన్,పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపూర్ బాషా,సీనియర్ నాయకులు రామమూర్తి,మధు, ఎస్సి సెల్ అసెంబ్లీ కార్యదర్శి నాగరత్నం,సాయిదత్తు, తెలుగునాడు విద్యార్థి నాయకులు ఫరూక్, తెలుగుయువత నాయకులు అబ్దుల్ కలాం పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీశైలం నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు బొల్లారం.మల్లేశ్వర రెడ్డి

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

ఆశా కార్యకర్తల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షులు రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిహెచ్ఎన్ భాగ్యలక్ష్మికి సిఐటియు ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడారు. నేడు ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కారానికి నంద్యాల జిల్లా డిఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆశలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశలకు సంబంధం లేని పనులను చేయించరాదన్నారు. పని భారం వేధింపులు బెదిరింపులు ఆపాలన్నారు. 14 రకాల యాప్లు డౌన్లోడ్ చేసుకుని 26 రకాల పనులను యాప్ ద్వారా రికార్డులను రాయించడం సెల్ ఫోన్లు పనిచేయకపోతే వాటిని ఖర్చు పెట్టుకుని చేయించుకోవాలని అధికారులు చెప్పడం సరికాదు అన్నారు. యాప్ ద్వారా పనులు చేయకపోతే వేతనాలు కట్ చేస్తామని లేకపోతే విధుల నుంచి తొలగిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సచివాలయంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉండాలని ఉదయం సాయంత్రం రిజిస్టర్లో సంతకాలు చేయాలని అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. నంద్యాల జిల్లాలో జరుగు భారీ ధర్నాకు అత్యధిక సంఖ్యలో ఆశ వర్కర్లు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుజాత, రమణమ్మ, శేషమ్మ, లలితమ్మ ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికై మంగళవారం డిఎంహెచ్వో కార్యాలయం దగ్గర జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, కొత్తపల్లి మండలం ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు లలితమ్మ, సోమేశ్వరి, సుజాత, సుశీలమ్మలు కోరారు. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆశ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


సూపర్ వేజర్‌కు కు వినర పత్రం ఇస్తున్న ఆశాలు

క్లస్టర్ సమావేశానికి తెలుగు తమ్ముళ్లు

- మండల కన్వీనర్ మార్పుతో అలిగిన ఓ వర్గం - బుజ్జగింజేందుకు యత్నాలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్తపల్లి మండలంలో తెలుగు తమ్ముళ్ల వర్గపోరు మొదలైంది. నందికొట్కూరులో సోమవారం నియోజకవర్గంలోని కొన్ని మండలాలలోని క్లస్టర్ల ఇన్చార్జిలకు సమావేశం ఏర్పాటు చేయగా.. కొత్తపల్లి మండలం నుంచి సమావేశానికి నాయకులు గైర్హాజర్ కావడంతో వర్గపోరుపై మరింత బహిర్గతం అయిన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కొత్తపల్లి మండల టిడిపి కన్వీనర్ మార్పు కారణమై ఉంటుందని చర్చ నడుస్తోంది. కొత్తపల్లి మండలం ఎప్పటినుంచో టిడిపికి కంచుకోటలా ఉంది. అయితే గతకొన్ని రోజుల క్రితం టిడిపి మండల కన్వీనర్ల మార్పు చేయడం పట్ల కొందరి టిడిపి నాయకులు, కార్యకర్తలు అసంతృప్తితో గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. మండల కన్వీనర్ మార్పు పట్ల ఓవర్గం అసంతృప్తితో కన్వీనర్ల పంచాయతీ తెగేదాకా సమావేశాలకు పాల్గొనేది లేదని నియోజకవర్గ నాయకులకు తేల్చి చెప్పినట్లు ప్రచారం నడుస్తోంది. ఏది ఏమైనప్పటికీ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో టిడిపిలో వర్గ పోరు మొదలై ఓవర్గం దూరంగా ఉండడం పట్ల పలువురు టిడిపి శ్రేణుల్లోనూ.. ప్రజల్లో చర్చ కొనసాగుతోంది. ఈ విషయంపై నియోజ కవర్గంలో ఉన్న టిడిపి అధిష్టానం ఈ పంచాయతీని ఏ విధంగా తెంచు తారో..

సీమ అభివృద్ధిపై గళమెత్తడం లేదు

- పార్టీలు అవకాశం ఇస్తే ఎంపికి పోటీ చేసేందుకు సిద్ధం - మాజీ ఎంపీ గంగుల

ప్రజాశక్తి - చాగలమర్రి

రాయలసీమ అభివృద్ధి కోసం జిల్లాలలో ఉన్న ప్రజాప్రతినిధులు గళంమెత్తకపోవడం విచారకరంగా ఉందని నంద్యాల పార్లమెంటు మాజీ సభ్యులు, రాజ్యసభ సభ్యులు గంగుల ప్రతాపరెడ్డి అన్నారు. సోమవారం చాగలమర్రి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. మండలంలో గంగుల కుటుంబానికి సానుభూతిపరులుగా ఉన్న రామ తులసీశ్వర్ రెడ్డి, శెట్టి వీడు గ్రామానికి చెందిన రామనారాయణరెడ్డి, మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి ధైర్యంగా ఉండాలని అలాగేఅనారోగ్య కారణంగా చికిత్స పొందుతున్న మాజీ డిసిసి కార్యదర్శి షేక్ షాబల్ మొహిద్దిన్ ఇంటికి వెళ్లి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు, నారపురెడ్డి కుమారుడు, శ్రీనివాస్ రెడ్డి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రాష్ట్రాలను విభజించి రాయలసీమ జిల్లాలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. విడిపోయిన నాటి నుండి ఇప్పటి ప్రభుత్వం రాయలసీమ జిల్లాల నీటి వాటా తేల్చకుండా మభ్యపెడుతోందన్నారు. తనకు ఇంకా ఓపిక ఉందని రాయలసీమ అభివృద్ధి కోసం, గ్రేటర్ రాయలసీమ కోసం తాము నిరంతరము పోరాటం చేస్తానని అన్నారు. పార్టీలు అవకాశం కల్పిస్తే నంద్యాల పార్లమెంట్ నుండి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాని, అవకాశం కల్పించకపోతే ఆళ్లగడ్డ, లేదా నంద్యాల నియోజకవర్గాలలో స్వతంత్ర అభ్యర్థిగానైనా శాసనసభ బరిలో ఉంటానని స్పష్టం చేశారు. అనంతరం ఇటీవల మరణించిన వారి కుటుంబాలను స్వయంగా కలుసుకొని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ డైరెక్టర్ సీసా వెంకటేశ్వర్లు, అమర్నాథరెడ్డి, సయ్యద్ మోహిదీన్, షాబులు మొహిదీన్, హనుమంత రెడ్డి శ్రీనివాసరెడ్డి, ఈదుల బ్రహ్మానంద రెడ్డి, పిట్టి ఏసు ముల్లా గౌస్ పిరాన్, ముత్యాలపాడు భాష (లాడెన్) వంగల రామచంద్రారెడ్డి, సుధాకర్, వలి , విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గంగుల ప్రతాపరెడ్డి

సమస్యల పరిష్కారానికే గడపగడపకు..

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలంలోని బాపనంతాపురం గ్రామానికి ఆయన వచ్చిన సందర్భంగా వైసిపి నాయకులు గ్రామ ప్రజలు ఆయనకు గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆ ఇంటిలో లబ్ద పొందిన ప్రజల వివరాలను ఆర్థిక అంశాలను ప్రజలకు వివరించడంతో పాటు వైయస్సార్ ప్రభుత్వం అయితేనే ప్రజల సమస్యలను పరిష్కరించగలరని ఆయన వివరించారు. గ్రామంలోని ప్రతి గడపకు ఆయన వెళ్లి తమ ప్రభుత్వం చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్లకాల తిరుపాలమ్మ, వైసిపి నాయకులు రాజేష్, వైసిపి మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు సయ్యద్మీర్, కౌన్సిలర్ విజయ్ చౌదరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామ ప్రజలు

అభివృద్ధి పనులను పరిశీలించిన ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానం పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను దేవస్థానం కార్యనిర్వాహణాధికారి లవన్న సోమవారం నాడు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా హేమారెడ్డి మల్లమ్మ దగ్గర నిర్మించబడుతున్న సప్త గోకులం, గణేష్ సదనం, ధర్మ కాటా, శ్రీశైలం ప్రాజెక్టులో నిర్మించబడుతున్న వసతి గృహాల నిర్మాణాలను ఇఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ గోవులు విస్తాలంగా ఉండేందుకు నిర్మాణాలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నక్షత్ర వనంలో మొక్కలు నాటాలని ఆదేశించారు. వసతి గృహాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.


అధికారులతో మాట్లాడుతున్న ఇఒ లవన్న


సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

సచివాలయాలలో ప్రతిరోజూ స్పందన

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని 13 సచివాలయాలలో మధ్యాహ్నం మూడు గంటల నుండి ప్రతిరోజు స్పందన కార్యక్రమం నిర్వహించబడుతుందని ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను అందజేయవచ్చునని తెలిపారు. సచివాలయ అధికారులు తమ వినతి పత్రాలను అర్జీలను స్వీకరించినట్లయితే ఎంపీడీవోకు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. వేంపేంట గ్రామంలో ప్రభుత్వ పథకాలపై ఇంటింటి సర్వే వాలంటీర్ల ద్వారా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో సర్వేలో ఐదు స్థానం పాములపాడు మండలం ఉన్నట్లు ఆయన తెలిపారు

సర్వేయర్లకు సన్మానం

ప్రజాశక్తి -ప్యాపిలి

ప్రతి ఉద్యోగికి బదిలీ కావడం సర్వ సాధారణమని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ అన్నారు. సోమవారం కార్యాలయం బదిలీ ఐయిన సర్వేయర్లకు శాలువా కప్పి సన్మానించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సచివాలయం సర్వేయర్లు మురళి అనంతపురం జిల్లా రాయదుర్గంకు, బాలకృష్ణ మద్దికెరాకు, రేణుక గోశాని పల్లెకు, చిట్టి మంత్రాలయంకు బదిలీ అయ్యారని, ఎక్కడకి వెళ్లిన మంచి పేరు సంపాదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ మారుతీ, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి, ఏఎస్ఓ తేజస్వవణి, సర్వయర్ రాజు నాయక్, మల్లికార్జున, హరికృష్ణ, విఆర్ఓ సోమశేఖర్ పాల్గొన్నారు.


సర్వేయర్లకు సన్మానం చేస్తున్న దృశ్యం

మొక్కజొన్న సాగుపై అవగాహన

ప్రజాశక్తి - నందికొట్కూర్

మొక్కజొన్న సాగుపై రైతులకు శిక్షణ, అవగాహన సదస్సు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి బి శాంతరాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా నుంచి ఉమాదేవి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కోతుల బెడద నుండి పంటని కాపాడుకోవడానికి స్వయంగా చేస్తున్న యు వి లైట్ పద్ధతి, తదితర అంశాలపై రైతులకు వివరించారు. క్రమంలో వార్డ్ మెంబర్ ఎల్ల నాయుడు, శ్రీనివాసులు,షేక్ బాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

ఎమ్మెల్యేకు మంత్రి రోజా క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలో మంత్రి రోజా పర్యటనలో ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకపోవడం ఎమ్మెల్యే దళితుడు అయినందువలనేనని.. దళితుల మనోభావాలు దెబ్బతీయడమేనని ఇది తగదని మాల మహానాడు సీనియర్ నాయకులు రాజు, వైసిపి ఎస్సీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ అన్నారు. పట్టణంలోని స్థానిక మాల మహానాడు కార్యాలయంలో సోమవారం అధ్యక్షుడు నాగేష్ ఆధ్వర్యంలో మంత్రి రోజా పర్యటనలో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నియోజకవర్గంలో పర్యటించి ఎమ్మెల్యేను అగౌరపరచారన్న విషయంపై ప్రాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాల మహానాడుసీనియర్ నాయకులు రాజు, వైసీపీ ఎస్సీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దిలీప్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గానికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డితో కలిసి మంత్రి రోజా ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవ పర్యటనలో స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వడం బాధ్యత అని అన్నారు. మంత్రి ఆర్కే రోజా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ఎమ్మెల్యేను అగౌరవపరిస్తే పదవులకు రాజీనామా చేస్తాం

ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ దళితుడైన ఎమ్మెల్యే ఆర్థర్‌ను అగౌరపరిస్తే తాము రాజీనామా చేస్తామని అన్నారు. దళిత ఎమ్మెల్యేను అడుగడుగున అవమానిస్తూ అగౌరపరచడం పరిపాటిగా మారిందని అన్నారు. పార్టీ పెద్దలు ఎలాంటి జోక్యం చేసుకోకపోవడం శోచనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో తాటిపాటి అయ్యన్న,వనముల పరుశరాముడు, శాతన కోట వెంకటేష్, కదిరి సుబ్బన్న, మనో రాజు,ప్రతాప్,పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పాలి : బిఎస్పి

సొంత నియోజకవర్గంలో దళిత ఎమ్మెల్యేకు తెలియకుండా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవలు చేసిన మంత్రి వెంటనే ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని బహుజన సమాజ్ పార్టీ నంద్యాల జిల్లా ఇన్చార్జి లాజరు, నియోజకవర్గ అసెంబ్లీ ఇన్చార్జి స్వాములు డిమాండ్ చేశారు. అంబేద్కర్ సర్కిల్‌లో మంత్రి ఆర్కే రోజాకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రోటోకాల్ పాటించకుండా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి రోజా ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

నీటి ఎద్దడి తలెత్తకుండా కృషి : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణ ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పేరంటాలమ్మ గుడి నుంచి తారకరామనగర్ వరకు 40 అడుగుల రోడ్డు వేస్తున్నారని అందువల్ల పైప్ లైన్ మార్చవలసి వచ్చిందని దానికి సంబంధించి నాలుగు రోజులు సమయం పట్టిందన్నారు. చిట్యాల దగ్గర పైపు పగిలిపోవడం వల్ల రెండు రోజులు సమస్య ఏర్పడిందని అందువల్ల మంచినీటికి అంతరాయం ఏర్పడిందని తెలిపారు. మంగళవారం సాయంత్రానికల్లా మున్సిపల్ సిబ్బంది అంతా కృషిచేసి డోన్ పట్టణ ప్రజలకు మంచి నీటిని అందించేందుకు కృషి చేస్తామన్నారు. పట్టణంలో ఎక్కడైనా మంచి నీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని అందించేందుకు కృషి చేస్తామన్నారు.

వైభవంగా చౌడేశ్వరి దేవి జయంతి

ప్రజాశక్తి - బనగానపల్లె


మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో అమ్మవారి జయంతి వేడుకలు ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అమ్మ వారికి బంగారు ఆభరణం విరాళం : చౌడేశ్వరి దేవి అమ్మవారికి నందవరం గ్రామ వైసిపి నాయకులు పిఎల్. తులసిశ్వర్ రెడ్డి, పిఎల్.నరసింహారెడ్డిలు కుటుంబ సభ్యులతో కలిసి రూ. 5 లక్షల 32 వేలు విలువ చేసే బంగారు ఆభరణమును విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈవో రామానుజన్ తెలిపారు.


చౌడేశ్వరి దేవి అమ్మవారు

ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణంలోని తోటగిరిలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి మాత జయంతి ఉత్సవాలలో ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు పట్టణ వైఎస్ఆర్సిపి నాయకుడు మారు బోతుల స్వామి,కౌన్సిలర్ మారుబోతుల విజయ్ కుమార్ ఎమ్మెల్యేకు భాజా భజంత్రీలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు మారుబోతుల రామకృష్ణ, శివశంకర్, పాణ్యం కిష్టయ్య, గరికే శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** నందికొట్కూరు పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి దేవాలయంలో చౌడేశ్వరి మాత జన్మదినోత్సవమును ఆలయ కమిటీ వారు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ పాల్గొని అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రవీంద్రబాబు, దే శెట్టి శ్రీనివాసులు, పాణ్యం వేణుగోపాల్,పూజారి బాబు, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి, మున్సిపల్ వైస్–చైర్మన్ మొల్ల రబ్బాని, మున్సిపల్ కౌన్సిలర్లు ఉండవల్లి ధర్మారెడ్డి , జాకీర్ హుస్సేన్, నందికొట్కూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ సగినేల హుస్సేనయ్య , జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చంటి గారి దిలీప్ రాజు, వైసిపి జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు వెంకటరమణ పట్టణ మహిళా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వనజ, వైసీపీ నాయకులు తమ్మడపల్లి విక్టర్, పెరుమాళ్ళ జాన్,ఆర్ట్ శ్రీను, బిజినవేముల మహేష్, శాతనకోట వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు. **మిడుతూరు :** మండలంలోని శ్రీ చౌడేశ్వరి దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కుంకుమార్చన, బోనాల కొండ కార్యక్రమాలు నిర్వహి ంచారు. సాయంత్రం 5 గంటలకు అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. మండల నాయకులు జెడ్పిటిసి యుగంధర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ లోకేష్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, పాణ్యం శ్రీనివాసులు, డాల్ కుమారస్వామి, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా


బోనాల కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయి తిమ్మయ్య

బంగారు ఆభరణాలు చోరీ

ప్రజాశక్తి - పాములపాడు

రూ.30 లక్షల విలువగల బంగారు ఆభరణాలు ఆర్టిసి బస్సులో చోరీకి గురయ్యాయి. పాములపాడు ఎస్సై అశోక్ తెలిపిన వివరాల మేరకు తమిళనాడు రాష్ట్రం తిరుచాపల్లికి చెందిన గోపాల్ గుణశేఖరన్ బంగారు ఆభరణాలు విక్రయించేందుకు కర్నూలుకు వచ్చారు. అక్కడ షాపులలో కొన్ని విక్రయించి ఆత్మకూరుకు వచ్చి అక్కడ షాపులలో కొన్ని విక్రయించి సోమవారం తిరుగు ప్రయాణంలో కర్నూలుకు వెళ్లేందుకు ఆత్మకూరులో విజయవాడ ఆర్టీసీ బస్సు ఎక్కాడు. మిగిలిన బంగారు ఆభరణాలు తన బ్యాగులో ఉంచుకొని కాళ్ళ దగ్గర పెట్టుకున్నాడు. కాస్త కునుకుపడ్డాడు. పాములపాడు పోలీస్ స్టేషన్ స్పీడ్ బ్రేకర్ వద్ద బస్సు నిదానం కావడంతో గోపాల్ గుణశేఖరన్ కాళ్ల దగ్గర బ్యాగును చూసుకుకోగా బ్యాగు లేదు. వెంటనే పాములపాడు పోలీస్ స్టేషన్లో గోపాల్ గుణశేఖరన్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విలేకరిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

(5వ పేజీ తరువాయి..) కంచర్ల విజయభాస్కర్, సత్య, పీరర్ మల్లయ్య, వహీద్, నాగరాజు, జలీల్, చంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు. **వెలుగోడు :** పాత్రికేయులపై దాడులు హేయమైన చర్య అని కెవిపిఎస్ రామదాసు, ఆవాజ్ కమిటీ మహమ్మద్ రఫీ అన్నారు. అనంతరం వెలుగోడు మండల తహసి ల్దార్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండల పాత్రికేయులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** మహానందిలో విలేకరిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం. రమేష్ బాబు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడారు. నాయకులు వహిదూదిన మాగబుల్ బాషా,నరసింహ, తదిత రులు పాల్గొన్నారు. బండి **ఆత్మకూరు :** వార్త విలేకరి మధుపై వైసిపి నాయకులు దాడి పిరికిపంద చర్య అని విలేకరులు, సిపిఎం నాయకులు రత్నమయ్య, రాజు అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసిల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. విలేకరులు రంగస్వామి, కొండయ్య, జమాల్, నాగరాజు, సౌకత్ అలీ, సుబ్బయ్య, సురేష్ ,అంజి నా కాంత్ రెడ్డి, సుబ్బయ్య, రామరాజు ,చంద్రబాబు తదితరులు ఉన్నారు.


వెలుగోడు : అధికారులకు వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు


ఆత్మకూరు : మాట్లాడుతున్న జర్నలిస్టులు